తొలకరి జల్లుతో రైతన్న బిజీ

- పత్తి పంటకే మొగ్గు
- పనుల్లో నిమగ్నమవుతున్న రైతన్న


పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

వాంకిడి: కురిసిన తొలకరి జల్లులతో రైతన్నలు బిజీగా మారారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు కొంతమంది రైతులు పత్తి విత్తనాలు నాటగా తగిన మోతాదులో వర్షాల కోసం మిగిలిన రైతులు ఎదురుచూస్తున్నారు. పంట పొలాల్లో దుక్కులు దున్నడం, సేకరించిన సేంద్రియ ఎరువులు చల్లడం వంటి పనులతో రైతుల్లో హడావుడి నెలకొంది. మండలంలో అత్యధికంగా సాగయ్యే పత్తి పంటకే రైతులు ఈసారి కూడా ఆసక్తి చూపుతున్నారు. అధికారుల సూచనలతో ఇప్పటికే రైతులు విత్తనాలు నాటేందుకు సిద్ధమయ్యారు.

34వేల ఎకరాల్లో పత్తి సాగు

ప్రతీ ఏడాది మాదిరి ఈసారి కూడా రైతులు పత్తి పంటకే మొగ్గు చూపుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 41వేల ఎకరాల్లో వ్యవసాయ సాగు భూమి ఉండగా అందులో పత్తి పంటను అత్యధికంగా 34వేల ఎకరాల్లో సాగు చేయనున్నారు. కందులు 6వేల ఎకరాలు, వరి 290 ఎకరాలు, పెసర్లు 250ఎకరాలు, కూరగాయలు, ఇతర పంటలు 400 ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా రైతులకు రైతు వేదికలు, వ్యవసాయ క్షేత్రాల్లో వ్యవసాయ అధికారులు విస్తారంగా అవగాహన కల్పిస్తున్నారు. అధికారుల సూచనల మేరకు విత్తనాల సేకరణ, ఎరువుల కొనుగోలు చేపట్టాలని సూచిస్తున్నారు. మృగశిర కార్తె నుంచి కురుస్తున్న చిరుజల్లులతో రైతులు విత్తనాలు నాటేందుకు ఎగబడుతున్నారు. విత్తనాలు నాటేందుకు తగిన మోతాదులో వర్షాలు కురవకున్నా ఎడతెరపి లేని వర్షాలు ప్రారంభమైతే విత్తుకునేందుకు జాప్యం జరుగుతుందని రైతులు ఇప్పటికే విత్తనాలు నాటుతున్నారు. అధికారులు మాత్రం విత్తనాలు నాటేందుకు తగిన మోతాదులో వర్షాలు కురిసే వరకు వేచి చూడాలని సూచిస్తున్నారు.

విత్తన దుకాణాల్లో సందడి..

మండల వ్యాప్తంగా పత్తి సాగు చేసుకునే రైతులు ఇప్పటికే పంట చేలల్లో పనులు పూర్తి చేసుకున్నారు. కురుస్తున్న చిరుజల్లులతో భూమిని సారవంతం చేసి అరకతో సాలు వేసి సిద్ధం చేశారు. అధికారుల సూచనలతో భూమికి తగ్గ విత్తనాల సేకరణలో కొందరు రైతులు బిజీగా ఉండగా మరి కొంతమంది ఇప్పటికే నాటారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాల్లో రైతుల సందడి నెలకొంది. లైసెన్సు కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు ఇంకా వేచి చూడాలి



మృగశిర కార్తెకు రావాల్సిన వర్షాలు నాలుగైదు రోజులు ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు ఆవేశపడి విత్తనాలు నాటుకోవద్దు. తగిన మోతాదులో వర్షాలు పడ్డాకే విత్తనాలు నాటుకోవాలి. చిరుజల్లులతో నాటిన విత్తనం పాడయ్యే అవకాశం ఉంది.

- తాండవ కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి

రోడ్లపై పశువుల సంచారం

- రహదారులపై రోజంతా తిష్ట వేస్తున్న పశువులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని యజమానులు
- నియంత్రించని అధికారులు


ప్రధాన రహదారిపై మూగజీవాలు

కౌటాల: మండలంలో రహదారులపై మూగజీవాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పశువులు రహదారిపై పడుకోవడం, రోడ్డుపై గంటలకొద్ది నిలిచి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి సంరక్షణపై యజమానులకు ఎలాంటి శ్రద్ధ లేకుండా పోయింది.

గుంపులుగా..

మండల కేంద్రంతో పాటు మండలంలోని ముత్తంపేట, సదాశివపేట, గురుడుపేట, బోదంపల్లి, తలోడి, మొగడ్‌దగడ్, గుండాయిపేట, తదితర గ్రామాల్లో మూగజీవాల సంతతి అధికంగా ఉంది. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కుక్కలు, పందులు, తదితర రకాల మూగజీవాలు గణనీయంగా వృద్ధి చెందాయి. రెండు నెలలుగా వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో రైతులు పశువులను ఇష్టారీతిగా వదిలేస్తున్నారు. దీంతో మూగజీవాలు రహదారిపై గుంపులుగా ఉంటున్నాయి.

ఇబ్బందుల్లో వాహనదారులు

రహదారులపై రాత్రిపగలు వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. పశువులను కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల రాత్రిపూట పశువులు రహదారులపై నిద్రిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనదారులు చీకట్లో మూగజీవాలను ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో మూగజీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయి. ముత్తంపేట, తలోడి, సదాశివపేట, గురుడుపేట, బోదంపల్లి, చింతలమానెపల్లి, సిర్పూర్(టి), బెజ్జూర్ మండలానికి వెళ్లే ప్రధాన రహదారులపై మూగజీవాల సంచారం అధికంగా ఉంటోంది. రహదారులపై తిరుగుతున్న మూగజీవాలను నియంత్రించడంలో ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారు. వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డం వస్తున్నాయి..

మూగజీవాలు రహదారులపై సంచరిస్తుండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. పశువులు రోడ్డుపై తిష్ట వేసి వాహనాలకు అడ్డంగా వస్తున్నాయి. యజమానులు మూగజీవాలను విచ్చలవిడిగా వదిలేస్తున్నారు.

- వినోద్, ఆటోడ్రైవర్, కన్నెపల్లి

అధికారులు పట్టించుకోవాలి

రహదారులపై ఇష్టారాజ్యంగా తిరుగుతున్న మూగజీవాలను నియంత్రించడంలో ప్రభుత్వ అధికారులు విఫలమయ్యారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రంలో పశువుల బెడద ఎక్కువగా ఉంది.

- ప్రకాశ్, వాహనదారుడు, తాటిపల్లి

క్లుప్తంగా

మీటర్ల కేటాయింపుపై విచారణ జరిపించాలి


వినతిపత్రం అందజేస్తున్న మనోహర్

ఆసిఫాబాద్: సరైన పత్రాలు, ఇంటి పన్ను రశీదులు లేకుండానే కొంత మందికి నిబంధనలకు విరుద్ధంగా కరెంటు మీటర్లు కేటాయిస్తున్నారని బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు నక్క మనోహర్ ఆరోపించారు. ఈమేరకు సోమవారం విద్యుత్ శాఖ డీఈఈ రాజశేఖర్ రావుకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వారసంతలో మజ్జిగ పంపిణీ

కౌటాల: మండల కేంద్రంలోని వారసంతలో సోమవారం కన్సెప్ట్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఉపశమనం కలగడానికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. దుర్గం సురేశ్, వంశీ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతి దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో, ఏపీవో

కెరమెరి: ఈ నెల 15న నిర్వహించనున్న పల్లె ప్రగతి దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. 19న తెలంగాణకు హరితహారంలో భాగంగా మొక్కలు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీలు చేస్తారని, రికార్డులు సిద్ధం పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

పోస్టాఫీస్ ప్రారంభం


పోస్టాఫీస్ ప్రారంభిస్తున్న ఐపీవో సతీశ్

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి గ్రామంలో నూతన పోస్టాఫీస్‌ను సోమవారం ఐపీవో సతీశ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు పోస్టాఫీసులో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోస్టాఫీసులో అందిస్తున్న సేవలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఎంవో కాశల, తాజమల్ హుస్సేన్, బీపీఎంలు రాధాకృష్ణ, అంజన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న జిల్లాలోని కార్మికులకు కనీస వేతనాన్ని అమలు చేయాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేష్ డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవో రఫత్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉత్తమ కవులకు ఆత్మీయ సత్కారం

ఆసిఫాబాద్అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన ఆసిఫాబాద్ కవుల సంఘం సభ్యులను సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన మాడుగుల నారాయణమూర్తి, జిల్లాస్థాయిలో దేవరాజు రేవతి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్, రమేశ్, వెంకట్రావ్, మధుకర్‌శర్మలను శాలువాలతో సన్మానించారు. సంఘం ప్రతినిధులు అశోక్, శ్రీనివాస్, ధర్మయ్య, మోహన్, రాజు, అంజన్న, వెంకన్న, రవీందర్, విజయ్‌కుమార్, రాధాకృష్ణచారి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులకు ప్రాధాన్యతనివ్వాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్


ప్రజావేదికలో మాట్లాడుతున్న చాహత్ బాజ్‌పాయ్

చింతలమానెపల్లి: పేద ప్రజలకు ఉపాధి కల్పించే ఉపాధిహామీ పనులకు సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో నిర్వహించిన ఉపాధిహామీ పనులలో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహించారు. జరిగిన పనులు వివరాలను ఆడిట్ బృందం సభ్యులు చదివి వినిపించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు కూలీల హాజరు పర్యవేక్షించాలన్నారు. పనుల్లో తప్పులు జరిగితే గ్రామపంచాయితీ స్థాయిలోని టీం వద్దనే సరి చేసుకోవాలన్నారు. అడెపల్లి, బాబాసాగర్, డబ్బా గ్రామాలలో జరిగిన ఉపాధి పనుల వివరాలను పరిశీలించిన ఆమె అవకతవకలపై ఆగ్రహం వ్యకం చేశారు. బాబాసాగర్‌లో చెల్లింపుల్లో తేడా రావడంపై సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం ప్రజావేదికలో డీఆర్‌డీవో సురేందర్ తనిఖీలు పరిశీలించారు. మండలంలోని ఆయా గ్రామాలలో పనులు పూర్తి చేసిన రైతు కల్లాల్లో చెల్లింపులు జరగకపోవడం, నిర్మాణాలలో నాణ్యత లేకపోవడంపై ప్రశ్నించారు. రవీంద్రనగర్‌లో నిర్మించిన 23 కల్లాల నిర్మాణంలో లోపాలు ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రవీంద్రనగర్2లో పూర్తయిన తెలంగాణ క్రీడామైదానం మట్టి పనుల కొలతల్లో తేడా ఉన్నట్లు తనిఖీ బృందం సభ్యులు తెలపగా విచారణ నిర్వహించారు. అవకతవకలకు కారణమైన కార్యదర్శులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని సంబంధిత వివరాల నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, అంబుడ్స్‌మెన్ సాయి శ్రీ, ఈజీఎస్ విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, క్యూసీ రమేశ్, ఎస్‌టీఎం నరేందర్, ఎస్‌కేపీలు కొమురయ్య, శైలు, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఏపీవో టి.గోవర్ధన్ సింగ్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు ప్రారంభం

కౌటాల: కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు మొదటి సంవత్సరం పరీక్షలకు నిర్వహించగా మొత్తం 10మంది విద్యార్థులు, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించగా నలుగురు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప తెలిపారు.

నాబార్డ్ సేవలను రైతులు వినియోగించుకోవాలి


పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: నాబార్డ్ ఆధ్వర్యంలో చేస్తున్న పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీజీఎం శ్రీరాం అన్నారు. సోమవారం మండలంలోని రౌట సంకేపల్లి జీపీలోని మెంగుబాయి గూడలో నాబర్డు ద్వారా చేస్తున్న నీటి కుంట పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాబార్డ్, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంత రైతులకు ఉపయోగపడే పనులు చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ డీడీఎం వీరభద్రం, ప్రసన్నకుమార్, రవీందర్, వాటర్‌షెడ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న రాథోడ్ సుభాశ్

వాంకిడి/ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచాలని విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ రాథోడ్ సుభాశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంతో పాటు, వాంకిడి మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మొబలైజింగ్ కోఆర్డినేటర్ సత్తయ్య, ఎంఈవో మనుకుమార్‌లతో కలిసి ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో మన ఊరు మన బడి, మన ఊరు మన బస్తీ కార్యక్రమం ద్వారా అన్ని సౌకర్యాలు సమకూర్చుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2331 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారని, ప్రైవేటు పాఠశాలల్లోని 521 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని తెలిపారు. ఎంఈవో కార్యాలయాలకు చేరిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు 20వ తేదీ లోగా విద్యార్థులకు ఇవ్వాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు వినేష్, మహేందర్, ప్రీతం, చైతన్య, సీసీవో వెంకటేష్, సీఆర్పీ సందీప్, సునీల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: మండలంలోని ముత్తంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. గతేడాది పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు గురుకుల విద్యాలయాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, రాధ, సోనియా పాల్గొన్నారు.

తగ్గని భగభగ..!

కౌటాల: జిల్లాలో ఎన్నడూ లేని విధంగా జూన్‌లో ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో సోమవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం జంబుగాలో పగటి ఉష్ణోగ్రతలు 44.2 డిగ్రీలు, కెరమెరిలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే కౌటాల, దహెగాం, చింతలమానెపల్లి మండలాల్లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో మధ్యాహ్న సమయంలో జనజీవనం స్తంభించింది.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులకు అందజేసిన బెంచీలతో శ్రీనివాస్

ఆసిఫాబాద్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకు సాగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు సోమవారం రూ.50వేల విలువైన బెంచీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. సరస్వతి శిశుమందిర్ పాఠశాలల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనిత మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలలో మరిన్ని సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ప్రతినిధులు ఇందూరి వెంకటేష్, గురుడచలం, భారతి, అనిల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో చెప్పులు లేకుండా!


వంట కోసం కట్టెలు తీసుకెళ్తున్న చిన్నారులు

రెబ్బెన: పొట్టకూటి కోసం తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా వంటచెరుకు కోసం వారి చిన్నారులు కాళ్లకు చెప్పులు లేకుండా మంటుటెండలో సోమవారం బయలుదేరారు. వివరాల్లోకి వెళ్తే.. గోలేటి ఎక్స్‌రోడ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో పని చేసేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి కూలీలు వచ్చారు. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లడంతో వంట చేసేందుకు కట్టెల కోసం చిన్నారులు భగభగ మండుతున్న ఎండలో చెప్పులు కూడా లేకుండా బయలుదేరారు. వారిని చూసి చలించిన గంగాపూర్ ఆలయ కమిటీ చైర్మన్ వొలువోజు వెంకటేశం చారి వారికి చెప్పులు కొనుక్కోవడానికి రూ.200 అందజేశారు. సోమవారం బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం కావడం కొసమెరుపు.

కాగజ్‌నగర్‌లో తెలంగాణ రన్ విజయవంతం



తెలంగాణ రన్ ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు

ఆసిఫాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ 2కే రన్ విజయవంతమైంది. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, డీఎస్పీ కరుణాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్‌లు జెండా ఊపి 2కే రన్ ప్రారంభించారు. వినయ్ ప్రథమ, తేజ ద్వితీయ, పోలీస్ విభాగంలో నయీం ప్రథమ, వినయ్ ద్వితీయ స్థానం, మహిళా విభాగంలో కౌసర్ భాను ప్రథమ, టియా ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి డీఎస్పీ, టౌన్ ఎస్‌హెచ్‌వో బి.స్వామి, కౌటాల సీఐ సాధిక్ పాషాలు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా న్యూట్రిప్లస్ డాక్టర్ సుమీత్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఏరోబిక్, జంబో నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఎస్సైలు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

నార్నూర్: గ్రామాల్లో గర్భిణులు, బాలింతల జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని గుంజాలలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉండడంతో వెంటనే మెరుగైన వైద్యం కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలతో పాటు ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్ చరణ్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ


యూనిఫాం పంపిణీ చేస్తున్న శ్యాంరావు

కెరమెరి: వేసవి సెలవుల తర్వాత మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సోమవారం ప్రారంభం కాగా వివిధ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల్లో 50 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కెరమెరి, గోయగాం, ఝరి, అనార్‌పల్లి, మోడీ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆడే ప్రకాశ్, నల్ల గొండ రమేశ్, వసంత్, ప్రేంసింగ్, ఎస్సీఆర్‌పీ చహకటి శ్యాంరావులు పాఠశాలలను సందర్శించి తగిన సలహాలు, సూచనలు అందించారు.

బీటీ రోడ్ల కోసం నిధులు మంజూరు

జన్నారం: మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.13.08కోట్లు మంజూరైనట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ సోమవారం తెలిపారు. పొనకల్ గ్రామ పంచాయతీ గోండుగూడ నుంచి చెరుకుగూడెం వరకు రూ.1.80కోట్లు, కవ్వాల్ రాంతాండా నుంచి సోనాపూర్ తాండా వరకు రూ.4.37కోట్లు, రేండ్లగూడ నుంచి రూప్‌నాయక్ తాండా వరకు రూ.1.91కోట్లు, టీడబ్ల్యూ రోడ్డు చింతగూడ నుంచి లక్ష్మీదేవి ఆలయం వరకు రూ.2.21కోట్లు, తపాలపూర్ టీడబ్ల్యూ రోడ్డు నుంచి మల్లన్న ఆలయం వరకు రూ.1.86కోట్లు, హాస్టల్ తాండా నుంచి నాయకపు గూడ వరకు రూ.93లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో ఈ పనులకు టెండర్లను పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

'సాయికుంట'ను కబ్జాదారుల నుంచి కాపాడాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సాయికుంట చెరువును కాపాడాలని బీఎస్పీ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జోనల్ కన్వీనర్ మద్దెల భవాని మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని తిరుమలగిరి కాలనీ పక్కన గల సాయికుంట చెరువును అభివృద్ధి పేరుతో స్థానిక కౌన్సిలర్ హరికృష్ణ అండదండలతో కొందరు చెరువుమట్టి వేసి చదును చేశారన్నారు. ఈ విషయాన్ని నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులు చెరువు ఎఫ్‌టీఎల్ హద్దు రాయిని తొలగించి, చెరువును ఆక్రమించి, రియల్‌ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారన్నారు. సాయికుంటలో ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను నిర్మించి చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు.

హైదరాబాద్ తరలిన డీఎస్పీ నాయకులు

జైపూర్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సోమవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జైపూర్ మండల డీఎస్‌పీ నాయకులు తరలివెళ్లారు. ప్రతి పౌరుడికి ఉచితంగా రాజ్యాంగాన్ని అందజేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాకు ప్రత్యేక వాహనాల్లో డీఎస్‌పీ నాయకులు రామస్వామి, సురేందర్, రాజు, వెంకటేశ్ తరలివెళ్లారు.

చింతగూడలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

జన్నారం: మండలంలోని చింతగూడ గ్రామం శివాలయంలో సోమవారం శివలింగం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ భక్తి శ్రద్ధలతో విగ్రహాలతో ఆలయానికి వెళ్లి, పూజారుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్ కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు.